# పెళ్ళి

బాబ్జి గదిలో అలారం గడియారం మోగుతోంటే నాకు మెలకువ వచ్చింది. అయిదయింది. లేచి కూర్చుని దుప్పటి తొలగించాను. కిటికీలోంచి చల్లటి గాలి వీస్తోంది. సాధారణంగా నాకు అయిదు కాక ముందే మెలకువ వస్తుంటుంది. రాత్రి ఆలస్యంగా నిద్రపోవడం వలన అలారం శబ్దానికి కాని మెలకువ రాలేదు.

బాబ్జి గదిలో లయిటు వెలిగింది . వాడిని చూస్తుంటే నాకు జాలి వేస్తుంటుంది. ఉదయాన్నే లేచి బాయిలర్ వెలిగిస్తాడు. స్టవ్ ముట్టించి పాలు కాచి కాఫీ తయారు చేస్తాడు. పిల్లల్ని నిద్రలేపి స్నానాలు చేయించి బడికి పంపిస్తాడు. వాడు ఫేక్టరీకి బయలుదేరే సమయానికి కాని నా కోడలు అనసూయ నిద్రలేవదు.

బద్దకంలో అనసూయ నా భార్యకేం తీసిపోదు. నా భార్య బతికి ఉండగా ఆమె సతాయింపులు తట్టుకుంటూ సౌఖ్యంగా నేను గడిపిన రోజులు చాలా తక్కువ. బాబ్జి నాలా కాకుండా ప్రతి విషయంలోనూ సర్దుకు పోతుంటాడు. నాకు వాడికున్నంత సహనం లేదు. ఎప్పుడోకాని సర్దుకుపోయేవాడిని కాదు. నాకు ఇప్పుడు అరవయి సంవత్సరాలు నిండాయి.

బాబ్జి నాగదిలోకి వచ్చి మీటనొక్కాడు. లయిటు వెలిగింది. “ఎంతసేపయింది లేచి?” అడిగాడు.

“ఇప్పుడే” అని మంచం దిగి లేచి నిలబడ్డాను.

స్నానాల గదిలోంచి బయటకు రాగానే గ్లాసుతో కాఫీ ఇచ్చాడు. కాఫీతాగి ఉదయం నడకకు తయారవుతోంటే, “మీరు స్టేషన్‌కు వెళ్లడం లేదా?” అడిగాడు.

వెంటనే అర్థం కాక వాడి ముఖంలోకి చూశాను.

“ఇవాళ అయిదో తారీఖు. మీ బొంబాయి స్నేహితుడు దశరథంగారు ఈ ఉదయం బండికి వస్తున్నారని రెండురోజుల కిందట మీరే అన్నారు. ఆయన్ని రిసీవ్ చేసుకోడానికి స్టేషన్‌కు వెళ్ళడం లేదా?”

"దశరథం వస్తున్న సంగతి మర్చి పోయానురా బొంబాయి నుండి వచ్చే బండి ఎన్ని గంటలకు వస్తుంది?"

"ఆరు గంటల కనుకుంటాను."

"నువ్వు గుర్తుచేసి ఉండకపోతే ఎప్పటిలా మార్నింగ్‌వాక్‌కు వెళ్ళిపోయి ఉండేవాడిని. నాకీ మధ్య మతిమరుపు ఎక్కువవుతుందిరా. స్టేషన్‌కు వెళ్ళి అతన్ని మనింటికి తీసుకువస్తాను." అని చెప్పులు తొడుక్కుని బయటకు వచ్చాను.

❁ ❁ ❁

దశరథానికీ నాకూ ఉన్న స్నేహం ఇప్పటిది కాదు. ముప్పయి అయిదేళ్ళ కిందటి నుండి ఉంది. అతనూ నేను అప్పట్లో బొంబాయిలో ఒకే ఆఫీసులో పనిచేశాం కొన్నాళ్ల పాటు ఒకే గదిలో ఉన్నాం. అతనిది విశాఖపట్టణం దగ్గర చిన్న పల్లెటూరు. అతను నాకన్నా ఎనిమిది సంవత్సరాలు చిన్నవాడు. సంవత్సరానికో సంవత్సరంన్నరకో ఒకసారి వాళ్ల ఊరు వెళ్ళేప్పుడు, తిరిగి వచ్చేప్పుడు మా ఊళ్లో ఆగి మా ఇంట్లో ఒకటీ రెండురోజుల పాటు తప్పకుండా గడుపుతాడు. అతను ఉన్నన్ని రోజులు నాకెంతో సంతోషంగా ఉంటుంది. అతను మరిన్ని రోజులు నా దగ్గర ఉంటే బావుండనిపిస్తుంది. ఉండడు. నన్ను ఎన్నోసార్లు బొంబాయికి రమ్మని ఆహ్వానించినా వెళ్లలేక పోయాను.

బొంబాయి నేవీ ఆఫీసులో ఉద్యోగంలో చేరినప్పుడు నాకు మొట్ట మొదటిగా పరిచయం చేయబడిన తెలుగు వ్యక్తి దశరథం. నన్ను అతను పనిచేస్తున్న విభాగంలోనే వేశారు. మనిషి మంచివాడే. చూడడానికి బావుండడు. కోలముఖం, పెద్ద నుదురు, పొట్టి ముక్కు పళ్లు ఎత్తుగా ఉండి చిగుళ్లు కనిపిస్తుంటాయి. నేను ఉద్యోగంలో చేరిన మధ్యాహ్నం నా దగ్గరకు వచ్చి, "రండి బయటకు వెళ్లి టీ తాగొద్దాం" అన్నాడు.

"ఇప్పుడే కేంటిన్‌లో టీ తాగి వచ్చాను".

"మన కేంటిన్ టీ కన్నా బయట టీ బావుంటుంది రండి" నా జవాబు కయి ఎదురు చూడకుండా వరండాలోకి నడిచాడు. నాకు తప్పలేదు. చేస్తున్న పని పక్కన పెట్టి లేచి అతన్ని అనుసరించాను. మా ఆఫీసుకు కొద్ది దూరంలో ఉన్న ఇరానీ హోటల్‌లో కూర్చున్న తర్వాత అడిగాడు, "టిఫిన్ ఏమన్నా తీసుకుంటారా?"

"వద్దు. ఆఫీసుకు వచ్చే ముందే హోటల్‌లో భోజనం చేసివచ్చాను."

రెండు టీలకు ఆర్డరిచ్చాడు. సిగరెట్ పెట్టె తీసి నాకొకటి ఆఫర్ చేసి తానొకటి తీసుకుని వెలిగించాడు.

"మీరు బొంబాయి రావడం ఇదే మొదటిసారా?" అడిగాడు.

తలూపాను.

"ఎప్పుడు వచ్చారు?"

"మొన్న ఉదయం వచ్చాను. నిన్న సెలవు కాబట్టి ఇవేళ ఉద్యోగంలో చేరాను. ఆఫీసులో పని ఎలా ఉంటుంది?"

"చేసే వాడికి పని తరగదు. పని ఎగ్గొట్టి తిరిగేవాడిని, కాస్త గట్టిగా మాట్లాడే వాడిని, ఎవరూ ఏమీ అనరు. మీదేఊరు?"

చెప్పాను.

"ఈ ఉద్యోగం కోసం మీరు ఇంత దూరం రాకుండా ఉండవలసింది. డిపార్ట్‌మెంటల్ పరీక్షలు రాసి పాస్ అయితే ప్రమోషన్లు వస్తాయి. లేకపోతే గొర్రెతోక జీవితం. మోక్షం ఉండదు".

అతని ముఖంలోకి చూసి నవ్వి, "మీరెందుకు వచ్చారు?" అడిగాను.

అతను గుండెనిండా పొగపీల్చి వదిలి, "మునుపు నేను విశాఖపట్టణం ఆఫీసులో పనిచేశాను. మా ఆఫీసరుతో గొడవపడితే పనిష్మెంటు మీద ఈ ఆఫీసుకు బదిలీ చేశారు." ఆగి పావు నిమిషం పాటు మవునంగా ఉండి, "ఇప్పుడు నేనీ మహానగరానికి బందీని. నన్ను ఇక్కడి నుండి మళ్లీ విశాఖ పట్టణానికి బదిలీ చేస్తే వెళ్లను. నాకు బొంబాయి అంటే ప్రేమ ఏర్పడింది" అన్నాడు. మాటలు నవ్వుతూ అన్నా బాధగా అన్నట్టు అనిపించింది.

టీ వచ్చింది.

"మీరు ఎక్కడ ఉంటున్నారు?" అడిగాను.

"మటుంగాలో."

"మీకు పెళ్ళి అయిందా?"

"లేదు. నా ముఖం చూడండి - ఎంత అసహ్యంగా ఉంటుందో? చూస్తూ చూస్తూ ఏ ఆడదీ నన్ను పెళ్ళి చేసుకోదు" అని పకపకమని నవ్వాడు.

నాకు అతని మీద జాలి వేసింది. కప్పు అందుకుని "మిమ్మల్ని మీరు ఎందుకు కించపరుచుకుంటారు?" అన్నాను.

అతనేదో అనబోయాడు. కాని అనలేదు. మవునంగా కప్పు ఖాళీ చేసి చివరంటా కాలిన సిగరెట్‌తో మరో సిగరెట్ వెలిగించుకుని సిగరెట్ పీకను యాష్ట్రేలో పడేశాడు.

సిగరెట్ పీకలోంచి పొగ సన్నగా వస్తోంది.

"ప్రస్తుతం మీరు ఎక్కడ ఉంటున్నారు?"

"వి.టి స్టేషన్‌కు దగ్గరగా ఉన్న లాడ్జిలో ఉంటున్నాను".

"మీకు పెళ్ళి అయిందా?"

"అయింది."

"పిల్లలా?"

"ఒక బాబు.... మన ఆఫీసుకు దగ్గరలో ఇల్లు ఏదయినా దొరకదా?"

"ఈ మహానగరంలో ఒక మనిషి పట్టే గదిని ఇల్లు అని అంటారు. దానికీ పగిడీ అడుగుతారు. ఎక్కువే ఉంటుంది. మన ఆఫీసుకు దగ్గరలో గది దొరకడానికి ఏదయినా మిరకిల్ జరగాలి. సంభవం కానేకాదు. డెబ్బయి మయిళ్ల దూరంలోని సబర్బన్‌లో దొరుకుతాయి. రావడానికి పోవడానికి మీకు చాలా కష్టమవుతుంది. మీకు ఇక్కడ బంధువులు కాని, తెలిసిన వాళ్లుకాని లేరా?"

"లేరు".

"మీరు రెండు మూడు నెలలు ఆగండి. ఈ బొంబాయి జీవితం మీకు నచ్చితే గదికోసం ప్రయత్నం చేద్దాం. పేయింగ్ గెస్ట్ ఎకామిడేషన్ అన్నా దొరక్కపోదు. అంతవరకు మీరు నా గదిలో ఉండడానికి నాకు ఎటువంటి అభ్యంతరం లేదు. టీ తాగండి. చల్లారిపోతోంది" అని చేతి గడియారం వంక చూసుకున్నాడు.

నా గుండెలో గుబులు మొదలయింది. కేంద్ర ప్రభుత్వ ఆఫీసుకదా, ఉండేందుకు క్వార్టర్స్ ఉంటుంది కదా అని ఇంత దూరం వచ్చాను. ఇక్కడి పరిస్థితులు ఇలా ఉంటాయని ముందే తెలిసిఉంటే వచ్చి ఉండేవాడిని కాదు. అయినా అతన్ని చూశాక ధైర్యం ఏర్పడింది. రెండు రోజుల తర్వాత లాడ్జి వదిలి అతని గదిలో చేరాను.

అయిదు నెలలు గడిచాక ఒకరోజు వెంటనే అతన్ని బయల్దేరి రమ్మని వాళ్ల ఊరు నుండి టెలిగ్రాం వచ్చింది. ఆ మధ్యాహ్నపు బండి పట్టుకుని వెళ్ళిపోయాడు. వాళ్ళూరు చేరిన తర్వాత తను క్షేమంగా చేరినట్టు తెలియ చేస్తూ తన పెళ్ళి నిశ్చయం అయినట్టు, త్వరలోనే శుభలేఖలు పంపిస్తానని నాకు ఉత్తరం రాశాడు. ఆ ఉత్తరం అందిన మూడో రోజున ఒక కట్ట శుభలేఖలు పంపించి తన స్నేహితుల పేర్ల జాబితా రాసి వాళ్ళకు పంచిపెట్టమని కోరాడు. తను రాసిన ఉత్తరం, శుభలేఖలు

అందినట్టు తెలియజేస్తూ శుభలేఖలు అతని మిత్రులకు అందించినట్టు ఉత్తరం రాశాను. అతని పెళ్ళికి నేనూ కొంతమంది మిత్రులు టెలిగ్రాముల ద్వారా శుభాకాంక్షలు తెలియచేశాం.

ఇది జరిగిన వారం రోజులకు నేను ఆఫీసు నుండి గదికి చేరుకునేసరికి దశరథం గదిలో ముసుగుతన్ని పడుకుని ఉన్నాడు. కొత్త పెళ్ళికొడుకు అంత త్వరగా తిరిగి వచ్చేసినందుకు నాకు ఆశ్చర్యం వేసింది. నెలరోజులపాటు సెలవు తీసుకుని వెళ్ళాడు. చెప్పులు గోడవారగా వదిలి తువ్వాలు అందుకుని ముఖం కడుక్కునేందుకు స్నానాల గదిలోకి వెళ్దామనుకునేంతలో అతను దుప్పటి తొలగించి లేచి గోడకానుకుని కూర్చున్నాడు. అతని కళ్ళు ఎర్రగా ఉన్నాయి. ఆగి మంచం మీదకు వంగి, "కంగ్రాచ్చులేషన్స్" అని నా కుడి చేయి ముందుకు చాపాను.

అతని చేయి దుప్పటిలోంచి బయటకు రాలేదు. వాలిపోతున్న తల బలవంతంగా పయికెత్తి బాధగా నవ్వి, "నా పెళ్ళి జరగలేదు బ్రదర్" అన్నాడు.

ఉలిక్కిపడ్డాను. అతని మాటలు ముద్దగా ఉన్నాయి. నాటుసారా వాసన గుప్పుమంది. అతను సారా తాగుతాడన్న సంగతి నాకు తెలియదు. నాకు తెలిసి మునుపు ఎప్పుడూ తాగలేదు. అతను చెప్పిన విషయం నిజమో కాదో నాకు అర్థం కావడంలేదు. నమ్మలేనట్టు తల అడ్డంగా ఆడించాను.

"నిజం బ్రదర్. నిజం.... నీతో నేను ఎప్పుడయినా అబద్ధాలు చెప్పానా...? పీటల మీద పెళ్ళి ఆగిపోయింది.... అసలేం జరిగిందో చెప్పేదా?"

"చెప్పు."

"పెళ్ళి కూతురు మెడలో తాళి కట్టబోతుంటే ఆమె నా ముఖంలోకి తేరిపార చూసింది. అంతే. నన్ను తాళి కట్టనీయలేదు. పీట మీంచి లేచి 'ఛా. పెళ్ళి జరగడానికి వీల్లేదంటే వీల్లేదు' అని గొడవ చేసింది. ఎందుకని ఆమెను ఎవరూ అడగలేదు. ఆమె చెప్పనూలేదు. కారణం నేను ఊహించగలను. ఆమెను నేను తప్పు పట్టడంలేదు. అయితే ఒకటి ఆమె తన అయిష్టత చివరి నిమిషంలో కాక ముందే తెలియ చేసి ఉంటే బావుండేది. నాకింత హ్యూమిలేషన్ ఉండక పోను. అంతకు ముందు పెళ్ళి వరకు వచ్చి ఆగిపోయిన సంఘటనలు మూడు జరిగాయి.... బ్రదర్... నా ముఖం చూసిన ఏ స్త్రీ నన్ను పెళ్ళి చేసుకోడానికి ఒప్పుకోదు.... నాకీ జన్మలో పెళ్ళికాదు. అంతే" అని చొక్కా జేబులోంచి మంగళ సూత్రం తీసి ఎదుటి గోడకేసి విసిరికొట్టాడు. రెండు చేతులతో ముఖం కప్పుకుని ఏడవడం మొదలెట్టాడు.

అతని మీద జాలి వేస్తోంది. మంచం మీద కూర్చుని అతని భుజం మీద చేయి వేశాను. అతన్ని ఎలా ఓదార్చాలో నాకు అర్థం కావడంలేదు.

పై సంఘటన జరిగిన నెలరోజుల తర్వాత మా ఊళ్లోని కాలేజీలో నాకు ఉద్యోగం దొరకడం వలన బొంబాయి ఉద్యోగానికి రాజీనామా చేసి మా ఊరు వచ్చేశాను.

❁ ❁ ❁

మెట్లు దిగుతూ చేతి గడియారం వంక చూసుకున్నాను. ఆరుంబావయింది. బొంబాయి నుండి బండి అప్పటికే వచ్చేసింది. ప్లాటుఫాం మీద నాకు దశరథం కనబడలేదు. ఒక్కో పెట్టెలోకి తొంగి చూస్తూ సగం పైగా వచ్చాను. అప్పటికే చాలా మంది దిగిపోయారు. చివరి నుండి నాలుగో బోగీలో అతన్ని కిటికీ పక్కనే ఉన్న సీటులో కూర్చుని కనిపించాడు అతన్ని చూడగానే సంతోషం వేసింది. దశరథం కుడి చేయి ఎదుటి సీట్లో కూర్చుని ఉన్న ఒక సాధువు చేతుల్లో ఉంది. కాషాయరంగు దుస్తుల్లో ఉన్న సాధువు లావుపాటి అద్దంతో దశరథం చేతిలోని రేఖలను పరీక్షగా చూస్తున్నాడు. అతని చూపులు సాధువు మీద ఉన్నాయి. నా రాక గమనించలేదు.

ఆ సమయంలో ఇద్దరి మధ్య ఉన్న మవునాన్ని పక్కకు నెట్టి, “స్వామీ, నా పెళ్ళి ఏ సంవత్సరంలో అవుతుందో చెప్పగలరా?” అడుగుతున్నాడు దశరథం.

❖ **యువ మాసపత్రిక, అక్టోబరు 1985**